# 11. ‘మందు’ మానే మందే లేదా మన దగ్గర?

-అబుల్ ఇర్ఫాన్

“ఉందో లేదో అది తరువాతి విషయం. మందు-మగువ మగాడి జన్మహక్కు, అది మానవనైజం. నైజమే మన ఇజం. ఈ నిజాన్ని కాదన్నవాడికి మరే నిజమూ బోధ పడదు. అసలు మనం మందెందుకు మానాలి? మానకపోతే నష్టం ఏమిటీ? మానితే లాభం ఏమిటీ? తాగితే తప్పేమిటీ? తాగకపోతే పుణ్యమేమిటీ.....?

“అయినా ఎవరికి భయపడి మానెయ్యాలి? ఏం ఆశించి మానెయ్యాలి? ముందు మన పాలకుల్ని, పోలీసుల్ని, సైనికుల్ని మానెయ్యమనండి. వారైనా ఎవరికి భయపడి మానుకుంటారు? ఏం ఆశించి మానుకుంటారు.....?

“మందులో ఉన్న మజా మందు తాగనివాళ్ళకు ఏం తెలుసు? మత్తుమందులోని గమ్మత్తేమిటో మందుబాబుని అడగండి. రాత్రి పడుకోబోయే ముందు ఓ పెగ్గు వేసుకుంటే చాలు.... ఆహా ఏమి హాయి! గాలిలో తేలిపోతున్నట్లు.... ఎంత హాయి ఈ రేయి! ఒక్కటంటే ఒక్కటి చాలు.... ప్రగాఢ నిద్ర.... సుమధుర స్వప్నం! అంతే- సమస్యలన్నీ ఒక్క పెగ్గుతో పటాపంచల్.....”

ఇవండీ మన మందుబాబుల ప్రశ్నలు! వాళ్ళ ప్రశ్నలన్నిటికీ మన డాక్టర్లు ఒకటే సమాధానం ఇస్తారు. కాని ఈ సమాధానం తాగుబోతులకు పూర్తిగా తృప్తినివ్వదు. వారి సమస్యలన్నిటినీ పటాపంచలు చేసే ఈ ‘సర్వరోగనివారిణి’ని ఓ అరబ్బు మహనీయుడు ‘ఉమ్ముల్‌ఖబాస్’ అని పేర్కొన్నాడు. అంటే చెడులకు మూలమన్నమాట.

గతంలో అనేక దేశాలు మద్యపానాన్ని నిషేధిస్తూ చట్టాలు చేశాయి. కాని ఏ దేశం కూడా మద్యపానాన్ని నిషేధించలేక పోయింది. ఈనాడు కూడా మన సమాజంలో అక్కడక్కడ మద్యపానానికి వ్యతిరేకంగా నినాదాలు, నిరసనలు వ్యక్తమవుతున్నాయి. అయినా మనం మద్యం వెల్లువకు అడ్డుకట్ట వేయలేక పోతున్నాం.

సమాజాన్ని సర్వనాశనం చేసే అనేక చెడులలో మద్యపానం ఒక్కటి మాత్రమే. అందువల్ల సమాజాన్ని సమూలంగా సంస్కరించే కృషి చేయకుండా మద్యపానాన్ని మాత్రమే అరికట్టేందుకు ప్రయత్నిస్తే ఆ చికిత్స తాత్కాలిక ఉపశమనం మాత్రమే అవుతుంది. నేటికి 1400 సంవత్సరాల క్రితం అరబ్బులు సేవించేటంతటి మద్యం మరే జాతీ సేవించేది కాదు. దాదాపు ప్రతిఇంట్లో మద్యంతో నిండిన పెద్దపెద్ద బానలు ఉండేవి. అయితే పైన ప్రస్తావించబడిన ఆ ‘అరబ్బు మహనీయుడు’ సమాజ సమూల సంస్కరణోద్యంలో భాగంగా చేసిన కృషితో కేవలం 23 సంవత్సరాల అతిస్వల్ప కాలంలో మద్యపానం, ఇతర మత్తు పదార్థాలు పూర్తిగా అంతరించిపోయాయి. ఆ మహనీయుడ్ని, ఆయన ఉద్యమాన్ని దృఢంగా విశ్వసిస్తున్నవారు ఈనాడు కూడా మద్యం జోలికి పోకుండా ప్రశాంతంగా జీవిస్తున్నారు.



ఆ మహనీయుడే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (ఆయన ఆత్మకు శాంతి చేకూరుగాక). ‘ఏక దైవారాధన’తో ప్రారంభమయిన ఆయన ఉద్యమం మిథ్యాదైవాలతో పాటు అనేక సామాజిక, నైతిక రుగ్మతలను తుడిచిపెట్టింది. మద్యపానానికి అలవాటు పడినవారిలో ఏ ఒక్కడూ తన జీవితకాలంలో ఏనాడూ మద్యం దరిదాపులకే పోలేదు. కారణం పోలీసుల భయం కాదు; ఆరోగ్యం చెడిపోతుందన్న భయం కూడా కాదు; ప్రాపంచిక ప్రయోజనాల ఆశ అంతకన్నా కాదు. మరేమిటీ?

విశ్వసామ్రాజ్యాధినేత, సర్వసృష్టికర్త, సర్వోపగతుడయిన దేవుని పట్ల మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) కలిగించిన భయభక్తులు. మనిషిని ఎల్లప్పుడూ అంటిపెట్టుకొని ఉండి అతని కదలికలను, పలుకులను అనుక్షణం గమనిస్తూ వాటిని నమోదు చేస్తున్న దైవదూతల పట్ల భయం. మరణానంతరం పరలోకంలో కర్మవిచారణ జరిగి నరకశిక్ష చవిచూడవలసి వస్తుందన్న జవాబుదారీ భావన. మద్యం మానేసి పవిత్ర జీవితం గడిపితే స్వర్గభాగ్యాలు లభిస్తాయన్న ఆశ. పరలోకానికి సంబంధించిన ఈ ఆశ, భయాలే మద్యనిషేధానికి ముఖ్యప్రాతిపదికలు.

మరి ఈనాటి మన ప్రాపంచిక చట్టాలు, పోలీసులు మద్యపాన ప్రియుల్లో ఇలాంటి ఆశ, భయాలు కలిగించి వారిని మద్యం జోలికి పోకుండా నిరోధించగలరా? కంచే చేను మేసినట్లు పాలకులు, పోలీసులే మద్యాన్ని బాహటంగా సేవిస్తున్న ఈ కాలంలో మానవ నిర్మిత చట్టాలు మద్యపాన రక్కసిని మట్టుపెట్టగలవా? ఆనాడు సమాజ సమూల సంస్కరణ కోసం సృష్టికర్త మార్గదర్శకత్వంలో మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) లేవదీసిన ఉద్యమం పేరే ఇస్లాం. ఇప్పుడు మనం ఇస్లామీయ జ్ఞానానికి మూలాధారాలయిన ఖురాన్, హదీసులు ద్వారా సారా రక్కసికి శాశ్వతంగా ఎలా సమాధి కట్టడం జరిగిందో తెలుసుకుందాం.

ఇస్లాం తనను విశ్వసించినవారిని (ముస్లింలను) ఒకేఒక ఆదేశంతో ఒక్కసారిగా మద్యపానం నుండి శాశ్వతంగా నిరోధించలేదు. ప్రజల హృదయాల్లో ఏకదైవారాధనా విశ్వాసం, పరలోకపు జవాబుదారీ భావనలు బలంగా నాటుకున్న తరువాత మూడుసార్లు మూడు రకాల ఆదేశాలిస్తూ మద్యం, మత్తు పదార్థాలను అంచెలవారిగా నిషేధించింది. దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం), ఆయన అనుచరుల్లో కొందరు మాత్రమే ప్రారంభంలో మద్యాన్ని ముట్టేవారు కాదు. అది గమనించిన మరికొందరు అనుచరులు మద్యపానం, జూదం గురించి దైవాజ్ఞ ఏమిటని అడిగారు. దానికి సమాధానంగా సృష్టికర్త దగ్గర నుండి దైవప్రవక్త (సల్లం) హృదయఫలకంపై ఈ క్రింది ఆదేశం అవతరించింది:

“వారు నిన్ను మద్యం, జూదాలను గురించి అడుగుతున్నారు. ఈ రెండిటిలోనూ ఎంతో నష్టముందని చెప్పు. వీటిలో ప్రజలకు కొన్ని ప్రయోజనాలున్నా, ఆ ప్రయోజనాల కన్నా నష్టాలే ఎక్కువగా ఉన్నాయి.” (ఖుర్ఆన్-2:219)

మద్యసేవనంలో ప్రయోజనాలు కూడా ఉన్నాయని చెబుతోంది ఖుర్ఆన్. ఆ ప్రయోజనాలేమిటో మద్యం సేవించని వారికంటే మందుబాబులకే బాగా తెలుసు. అంచేత

ఆ ప్రయోజనాల గురించి ఇక్కడ ప్రస్తావించడం అప్రస్తుతం.

ఖుర్ఆన్‌లోని ఈ ఆదేశంలో మద్యం నష్టదాయకమైనదని, దేవునికి అయిష్టమైనదని మాత్రమే చెప్పబడింది. ఆనాటి నుంచే కొందరు ముస్లింలు మద్య సేవనం మానుకున్నారు. అయితే చాలామంది మానుకోలేదు. వారు ఒక్కో సారి మద్యం మత్తులో ఉండే ప్రార్థన చేస్తుండేవారు. దానివల్ల ప్రార్థనలో ఏకాగ్రతకు భంగం కలిగి వారు ఒక దానికి బదులు మరొకటి పఠిస్తుండేవారు. అందువల్ల మైకంలో ఉన్నప్పుడు ప్రార్థన (నమాజ్) చేయకూడదని కొంతకాలం తర్వాత ఈ క్రింది ఆదేశం అవతరించింది:

"విశ్వాసులారా! మీరు మైకంలో ఉన్నప్పుడు ప్రార్థన దరిదాపులకు పోకండి. ప్రార్థనలో మీరు పఠిస్తున్నదేమిటో మీకు తెలుస్తున్నప్పుడే ప్రార్థన చేయాలి." (ఖుర్ఆన్-4:43)

ఈ ఆదేశం అవతరించిన తరువాత చాలామంది మద్యసేవనం మానుకున్నారు. అయితే అలవాటు మానుకోలేక పోయిన కొందరు ముస్లింలు నమాజు వేళలు తప్పించి మద్యం సేవిస్తుండేవారు. ఆ తరువాత మరికొంత కాలానికి మద్యాన్ని పూర్తిగా నిషేధిస్తూ విశ్వప్రభువు ఈ క్రింది ఆదేశం అవతరింపజేశాడు:

"విశ్వాసులారా! మద్యం, జూదం, దైవేతరాలయాలు, పాచికల జోస్యం- ఇవన్నీ అసహ్యకరమైన పైశాచిక విషయాలు. వాటికి దూరంగా ఉండండి, మీ జీవితం సార్థక మవుతుంది. మద్యం, జూదాల ద్వారా షైతాన్ మీమధ్య విరోధం, విద్వేషబీజాలు నాటి మిమ్మల్ని దైవధ్యానం, ప్రార్థనల నుండి నిరోధించగోరుతున్నాడు. కనుక ఇకనైనా మీరు వాటిని మానుకోండి. దైవాజ్ఞలను, ఆయన ప్రవక్త హితవుల్ని పాటించండి. వాటిని పాటించకుండా ముఖం తిప్పుకుంటే మాత్రం (మీకే నష్టం), ఆదేశాన్ని యథాతథంగా అందజేయడమే మా ప్రవక్త బాధ్యత." (ఖుర్ఆన్-5:90,91,92)

ఈ ఆదేశం వెలువడిన తరువాత మద్యం నిషేధించబడిందని, ఇకనుండి ఎవరూ మద్యం ముట్టడంగాని, అమ్మడంగాని చేయరాదని మహాప్రవక్త ముహమ్మద్ (స) బహిరంగ ప్రకటన చేయించారు. ఈ ప్రకటన వినగానే ముస్లింలంతా తమ తమ ఇండ్లలో ఉన్న మద్యాన్నంతటినీ వీధుల్లోకి తెచ్చి పారబోశారు. మధుపాత్రలు నోటి దగ్గరకు తీసుకుపోయినవాళ్ళు సైతం మద్యం తాగకుండా ఆ పాత్రలను దూరంగా విసిరిపారేశారు. ఆరోజు మదీనా వీధుల్లో మద్యం ఏరులయి ప్రవహించింది. సారా అంగళ్ళు శాశ్వతంగా కనుమరుగై పోయాయి.

కొందరు అనుచరులు మద్యంగురించి ప్రస్తావిస్తూ "దీన్ని యూదులకు కానుకగా ఇవ్వచ్చా?" అనడిగారు. దానికి దైవప్రవక్త (స) "మద్యాన్ని నిషేధించినవాడు (దేవుడు) దాన్ని ఇతరులకు కానుకగా ఇవ్వడాన్ని కూడా నిషేధించాడు" అని చెప్పారు. మరొకతను వచ్చి దీన్ని మందుగా వాడుకోవడానికి అనుమతివ్వమని అడిగాడు. దైవప్రవక్త (స) అనుమతి నిరాకరిస్తూ "అది మందు కాదు, వ్యాధి" అన్నారు.



వేరొకతను వచ్చి "దైవప్రవక్తా! మేము తీవ్రమైన చలి ఉండే ప్రాంతంలో ఉంటున్నాం. కాయకష్టం కూడా ఎక్కువగా చేయవలసి వస్తుంది. మద్యం వల్ల మాకు కాస్తంత సేద తీరుతుంది. చలికి తట్టుకునే శక్తి కూడా వస్తుంది" అన్నాడు. దైవప్రవక్త (స) ఈమాట విని "మీరు తాగే ఆ పానీయం వల్ల మత్తు కలుగుతుందా?" అని అడిగారు. దానికావ్యక్తి "కలుగుతుంది" అన్నాడు. "అయితే దాన్ని మానుకోవాల్సిందే" అన్నారు దైవప్రవక్త (స). "కాని మాప్రాంతం జనం ఒప్పుకోరే ఎలా?" అన్నాడా వ్యక్తి. "ఒప్పుకోకపోతే వారితో యుద్ధం చేయండి" అన్నారు దైవప్రవక్త (స)- (హదీస్)

దీన్ని బట్టి మద్యంతో పాటు ఇతర మత్తుపదార్థాలన్నిటినీ ఇస్లాం నిషేధించినట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఈనాడు వాడకంలో ఉన్న గుట్కాలతో సహా అన్నిరకాల మత్తు పదార్థాలను ఖుర్ఆన్ పైశాచిక విషయాలుగా, అపరిశుద్ధ వస్తువులుగా, పరిగణించింది. పేర్లు ఏవైనా, ఎంత ఆకర్షణీయమైనా, మత్తు కలిగించే ప్రతి పానీయం, పదార్థం అది ఏమైనా సరే, ఎంత పరిణామంలో ఉన్నాసరే నిషిద్ధమే, అపరిశుద్ధమే.

వారికిలా చెప్పు: "అత్యధికసంఖ్యలో ఉండే అపరిశుద్ధవస్తువులు మిమ్మల్ని ఎంతగా ఆకట్టుకున్నా (అవి పరిశుద్ధవస్తువులు కాజాలవు) పరిశుద్ధం, అపరిశుద్ధం ఎన్నటికీ ఒకటి కాజాలవు. కనుక బుద్ధిమంతులారా! (ప్రతి వ్యవహారంలోనూ) దేవునికి భయపడుతూ మసలుకోండి, మీ జీవితం సార్థకమవుతుంది." (ఖుర్ఆన్-5:100)

మద్యం గురించి పారలౌకిక లాభనష్టాలు కూడా ఏమిటో కాస్త తెలుసుకుందాం.

దైవప్రవక్త (సల్లం) ఈవిధంగా పేర్కొన్నారు: "నా ప్రభువు ప్రమాణం చేసి ఇలా అన్నాడు- 'నా దాసులలో ఎవరైనా సారా తాగితే, ఎంత సారా తాగివుంటే అంత చీము (నరకంలో) నేనతనికి తాగిస్తాను. అలాగే నా దాసులలో ఎవరైనా నాకు భయపడి మద్యపానం మానుకుంటే, అతనికి నేను (స్వర్గంలో) పరిశుద్ధ కోనేరులలోని (మద్యం, మకరందం, పాలు వగైరా) పానీయాలు తాగిస్తాను." (హదీస్-అహ్మద్)

పై హదీసులో ఈ ప్రపంచంలో మద్యం మానుకున్న విశ్వాసులకు పరలోకంలో పరిశుద్ధ కోనేటి పానీయాలు లభిస్తాయని చెప్పబడింది. ఆ పానీయాల వివరాలు కూడా బ్రాకెట్‌లో తెలియజేయబడ్డాయి. మందు-మగువ ప్రస్తావనలు ఖుర్ఆన్‌లో కూడా పేర్కొనబడ్డాయి. ఈ క్రింది సూక్తులు చూడండి:

"దైవభీతిపరులకు వాగ్దానం చేయబడిన స్వర్గం మహా వైభవంగా ఉంటుంది. అక్కడ అణుమాత్రం కూడా కలుషితంకాని పరిశుభ్రమైన నీరుగల సెలయేరులు, ఏమాత్రం రుచి కోల్పోని స్వచ్ఛమైన పాలనదులు, పానప్రియులకు అమితరుచికరంగా ఉండే వారుణీ వాహినీలు, ఎంతో నిర్మలమైన తేనెఝురులు ప్రవహిస్తుంటాయి." (47:15)

"సజ్జనులు (స్వర్గంలో) కర్పూరజలం కలిపిన మద్యం సేవిస్తారు. ఇదొక సెలయేరు. దైవభక్తులు దీని నీటితోపాటు మద్యం సేవిస్తారు. వారు తాము కోరినచోట (కూర్చొని)

సులభంగా దాని శాఖను తీసుకుంటారు." (76:5,6); "వారిముందు సేవకులు వెండిపాత్రలు, గాజుగ్లాసులు తెచ్చిపెడ్తారు. గాజుగ్లాసులు కూడా వెండిలా మెరిసిపోతుంటాయి. అవన్నీ సరైన లెక్క ప్రకారం నింపబడిఉంటాయి. వారికక్కడ సొంటి కలిపిన మధుపాత్రలు అందించబడతాయి. ఇది కూడా స్వర్గంలో ప్రవహించే ఒక సెలయేరు. దీన్ని 'సల్‌సబీల్' (సుమధుర మద్యపానం) అంటారు." (76:15-18)

"వారి సమావేశాలలో నిత్యబాలకులు వారుణీవాహిని నుండి స్వచ్ఛమైన మధువుతో నిండిన గిన్నెలు, గ్లాసులు, కూజాలు తీసుకొని అటూఇటూ తిరుగుతారు. ఆ మధువు సేవిస్తే వారికి ఏమాత్రం మైకం కమ్మడంగాని, బుద్ధి మందగించడంగాని జరగదు." (56:17-19); "వారక్కడ కుర్చీలపై ఎదురెదురుగా కూర్చుంటారు. వారుణీవాహిని నుండి నింపిన మధుపాత్రలు వారి ముందుంచుతారు. అది కాంతిమంతమైన (విశేష) మధువు; సేవించేవారికి ఎంతో మధురంగా ఉంటుంది. దానివల్ల వారి దేహారోగ్యానికి ఎలాంటి నష్టముండదు. వారి బుద్ధివివేచనలు కూడా మందగించవు." (37:45-47)

"వారు స్వచ్ఛమైన విశేషమధుపానం సేవిస్తారు. ఆ మధుపాత్రలకు కస్తూరి సీళ్ళుంటాయి. సౌఖ్యాల కోసం పోటీపడేవారు దీన్ని సాధించడానికి పోటీపడాలి. ఆ మధువులో తస్నీం కలసిఉంటుంది. ఇదొక సెలయేరు. సన్నిహిత భక్తులు దీని పానీయంతోపాటు సారా సేవిస్తారు." (83:25-28)

"వారికి మేము ఎర్రటి దేహచ్ఛాయతో విశాల నేత్రాలు గల సుందరాంగుల్ని ఇచ్చి పెళ్ళి చేస్తాం." (44:54); "వారికోసం అక్కడ అందమైన కళ్ళుగల సుందరాంగులు ఉంటారు. ప్రత్యేకంగా వారి కోసమే దాచిపెట్టిన ముత్యాల్లాంటి ముగ్ధమనోహర సౌందర్యరాసులు వారు." (56:22-24)

"వారి దగ్గర పరపురుషుడ్ని కన్నెత్తి కూడా చూడని విశాలాక్షులుంటారు. ఆ స్త్రీలు కోడిగుడ్డు పెంకు క్రిందఉండే సున్నితమైన పొరలాంటి కోమలాంగులు." (37:48-49); "వారు మణిమాణిక్యాల్లా అసామాన్య సౌందర్యరాసులు."(55:58); "ఆ వనాలలో సద్గుణ సంపత్తితో కూడిన సౌందర్యవతులైన సతులు ఉంటారు. కనుక మీరు మీప్రభువు ఇచ్చే ఏ వరాలు నిరాకరించగలరు? ఎల్లప్పుడూ పర్ణశాలల్లోనే ఉండే సుందరాంగులు కూడా. కనుక మీ ప్రభువు ప్రసాదించే ఈ కానుకల్ని మీరెలా తిరస్కరిస్తారు?" (55:70-73)

ఇక నరకంలో పాపాత్ములకు లభించే ఆహారపానీయాలను గురించి వింటేనే శరీరం గగుర్పొడుస్తుంది. వాటిని గురించి ఖుర్‌ఆన్ ఇలా ప్రస్తావిస్తోంది:

"(నరకంలో ఉండే)వారికి త్రాగేందుకు మరిగే నీరివ్వబడుతుంది. ముండ్లతోకూడిన ఎండు గడ్డిపరకలు తప్ప ఎలాంటి తిండి దొరకదు. అది వారికి బలమూ ఇవ్వదూ, ఆకలీ తీర్చదూ." (88:6,7); "(అక్కడ) సలసలకాగే నీరు, చీము, నెత్తురు, వగైరా జుగుప్సాకరమైన పదార్థాలను రుచి చూడమను వారిని." (38:57,58)



"పాపాత్ములు జఖ్ఖూమ్ (అనే ఒక రకమైన నాగజెముడు) చెట్టు తప్పక తినవలసి ఉంటుంది. చమురుతెట్టులాంటి ఆ పదార్థం వారి పొట్టలోకి పోయి మరగకాచిన నీటిలా కుతకుత ఉడికిపోతుంది." (44:43-46); "మేమీ (జఖ్ఖూమ్) వృక్షాన్ని దుర్మార్గులకు పరీక్షగా చేశాము. అది నరకంలో అట్టడుగున మొలుస్తుంది. దాని పండ్లగుత్తులు రాకాసి తలల్లా (భయంకరంగా) ఉంటాయి. నరకవాసులు వాటిని (ఆవురావురుమంటూ) తిని కడుపు నింపుకుంటారు. తరువాత త్రాగడానికి వారికి సలసల కాగే నీళ్ళు లభిస్తాయి. ఆ తర్వాత వారిని తిరిగి నరకాగ్ని వైపు తోలుకెళ్ళడం జరుగుతుంది." (37:64-68)

"కనుక సత్యాన్ని నిరాకరించిన భ్రష్టులారా! మీరు జఖ్ఖూమ్ వృక్షాన్ని తప్పకుండా తినవలసిఉంటుంది. దాంతోనే మీరు (భరించలేని ఆకలితో) ఆవురావురుమంటూ కడుపు నింపుకుంటారు. ఆపై దప్పికగొన్న ఒంటెల్లా సలసలకాగే నీటిని (గటగట) త్రాగుతారు. ఇదే తీర్పుదినాన ఎడమపక్షంవారికి లభించే ఆతిథ్యం!" (56:51-56)

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) మద్యం గురించి ప్రస్తావిస్తూ "మద్యసేవనానికి అలవాటు పడి అదే స్థితిలో చనిపోయిన మనిషికి దేవుడు (నరకంలో) గౌతా సెలయేటి పానీయం తాగిస్తాడు" అని అన్నారు. అనుచరులు ఈమాట విని "గౌతా సెలయేరు అంటే ఏమిటీ దైవప్రవక్తా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) "గౌతా సెలయేరు అంటే వ్యభిచార స్త్రీపురుషుల మర్మావయవాల నుండి వెలువడే ద్రవాలు కలిగిన సెలయేరు అన్నమాట" అని చెప్పారు. (హదీస్-అహ్మద్)

దైవప్రవక్త (సల్లం) కాలంలో మద్యం సేవించినవాడికి గరిష్ఠ స్థాయిలో నలభై వరకు కొరడాదెబ్బల శిక్ష ఉండేది. మొదటి ఖలీఫా అబూబకర్ (రజి) పాలనాకాలంలో నలభై కొరడాదెబ్బల శిక్షే ఉండేది. రెండవ ఖలీఫా ఉమర్ (రజి) పాలనాకాలం తొలి రోజుల్లో కూడా నలభై కొరడాదెబ్బల శిక్షే ఉండేది. కాని దానివల్ల సారాయి త్రాగేవారు తమ అలవాటు మానుకోలేకపోయారు. అప్పుడు ఖలీఫాఉమర్ (రజి) ఇతర నాయకులతో సంప్రదించి ఈ శిక్షను ఎనభై కొరడా దెబ్బలకు పెంచారు. ఇమామ్ మాలిక్ (రహ్మలై), ఇమామ్ అబూహనీఫా (రహ్మలై)లు ఎనభై కొరడాదెబ్బల శిక్షనే నిర్ణయించారు. ఖలీఫా ఉమర్ (రజి) పాలనలో రూయషిద్ అనే వ్యక్తి రహస్యంగా సారా అమ్ముతున్న కారణంగా అతని దుకాణాన్ని కాల్చివేయడం జరిగింది.

ఇవీ మద్యనిషేధానికి ఇస్లాం సూచించిన ప్రాపంచిక, పారలౌకిక ఆదేశాలు, హితోపదేశాలు. వీటిని విశ్వసించి అనుసరించడం వల్లనే ఈనాటికీ ధార్మిక ముస్లింలు మద్యం జోలికి పోకుండా జీవించగలుగుతున్నారు.